www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 28 ఏప్రిల్ 2024 8 పేజీలు

ఏలూరు పశ్చిమ గోదావరి

విభజించి.. ఏమారుస్తూ..!

ఎన్నికల్లో గెలుపొందేందుకు ప్రధాన పార్టీలకు చెందిన నాయకులంతా సామాజిక తరగతులవారీగా జనాన్ని విడగొట్టి ఏమార్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా ఆయా తరగతుల ప్రజల్లో గొడవలు సృష్టించి కొట్లాటలను ప్రోత్సహిస్తున్న పరిస్థితి ఉంది.

- సామాజిక తరగతులవారీ ఓటర్ల మధ్య విభజన
- అదే ప్రాతిపదికన సమావేశాలతో తమవైపు తిప్పకునే యత్నం
- బిసి, ఎస్‌సి ఓటర్లపైనే ప్రధానంగా గురి
- దెందులూరు నియోజకవర్గంలో ఘటనే అందుకు ప్రత్యక్ష నిదర్శనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలంలో చెలరేగిన ఘర్షణలో దళితులను పావులుగా మార్చిన పరిస్థితే అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి నాయకులు ఓటర్లను విభజించి.. ఏమార్చి ఓట్లు దండుకోవాలని చూస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. ప్రతి నియోజకవర్గంలోనూ బిసి, ఎస్‌సి సామాజిక తరగతి ఓటర్లను తమ లక్ష్యంగా చేసుకుని రాజకీయాలు సాగిస్తున్నారు. సామాజిక తరగతులవారీగా సమావేశాలు పెడుతూ తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నారు. బిసి సామాజిక తరగతుల్లో శెట్టిబలిజ, యాదవ, వెలమ ఇలా ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారు. తాము గెలిస్తే మీ సామాజిక తరగతికి కమ్యూనిటీ హాల్ కట్టిస్తామని, మేలు చేస్తామంటూ మాయమాటలు చెబుతున్నారు. మీ సామాజిక తరగతికి చెందిన వ్యక్తి ఎన్నికల బరిలో ఉన్నారని, అంతా ఆయన్ని గెలిపించుకోవాలంటూ ఏమార్చేందుకు చూస్తున్నారు. కొన్నిచోట్ల ఇరుపార్టీలు ఒకే సామాజిక తరగతికి చెందిన అభ్యర్థులను బరిలోకి దింపాయి. దీంతో ఆయా సామాజిక తరగతుల మధ్య చిచ్చు పెట్టి ఎక్కువ మందిని తమవైపు తిప్పుకునేందుకు చూస్తున్నారు. దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలం వీరంపాలెంలో దళితుల్లో ఘర్షణ సృష్టించి వైసిపి, టిడిపి పావులుగా వాడుకుంటున్న పరిస్థితి ఉంది. ఈ గ్రామంలో శుక్రవారం టిడిపి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో కొంతమంది



దళిత యువకులు గాయపడ్డారు. వీరిని వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. దళితులపై టిడిపి దాడి చేస్తుందంటూ వైసిపి కొంతమంది దళితులతో మాట్లాడిస్తుండగా, వైసిపినే దళితులపై దాడి చేస్తుందంటూ టిడిపి మరికొంత మంది దళిత నాయకులతో విమర్శలు చేయిస్తోంది. ఆ ఘటనలో గాయపడింది దళితులే, విమర్శలు చేసుకుంటున్నది దళితులే కావడం చూస్తే దళితులను ఏవిధంగా నాయకులు విభజించి తమ పబ్బం గుడుపుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. చింతలపూడి నియోజకవర్గంలో మాల, మాదిగల మధ్య విభజన రేఖ సృష్టించి ఓట్లు దండుకునేందుకు ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు చిచ్చుపెడుతున్న పరిస్థితి కొనసాగుతోంది. నరసాపురం పార్లమెంట్ పరిధిలోని పలు నియోజకవర్గాల్లో శెట్టిబలిజ సామాజిక తరగతి మధ్య ఇదేవిధంగా విభజన సృష్టించి ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రధానపార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఏలూరు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో యాదవ సామాజిక తరగతి మధ్య విభజన రేఖ గీసి తమ వైపు తిప్పుకునేందుకు ఇరుపార్టీల నేతలు చేయని ..6లో



ఎండుగడ్డికి గడ్డు కాలం

- యంత్రాల కోతలతో ఏర్పడుతున్న గడ్డి కొరత
- నానాటికీ పెరుగుతున్న ధర
- ట్రాక్టర్ గడ్డి ధర రూ.8 వేల నుంచి రూ.పది వేల వరకు విక్రయం
- మెట్ట ప్రాంతంలో ట్రాక్టర్ గడ్డి రూ.12 వేలుపైనే
- ఆందోళనలో పాడి రైతులు

ప్రజాశక్తి - భీమవరం

ఎండుగడ్డికి గడ్డుకాలం ఏర్పడింది. వరిపంటను యంత్రాల ద్వారా కోస్తుండటంతో గడ్డి కొరత తీవ్రమైంది. దీంతో గడ్డి ధర రోజురోజుకీ పెరుగుతోంది. జిల్లాలో ట్రాక్టర్ గడ్డిధర రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇదే మెట్ట ప్రాంతాలైతే రూ.12 వేలు పైబడి పలుకుతుందంటే గడ్డికి ఎంత డిమాండ్ ఉందో అర్థమవుతోంది. ఇప్పటికే దాణా ధరలతో సతమతమవుతున్న పాడి రైతులు ఎండు గడ్డి ధర పెరిగిపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒకప్పుడు వ్యవసాయ భూమి ఉన్న ప్రతిఒక్కరికీ ఒకటో, రెండో పాడి గేదెలు ఉండేవి. ఒకపక్క వ్యవసాయం చేసుకుంటూనే మరోపక్క పాడి గేదెలను పెంచుకుంటూ దానిపై ఆధారపడి జీవిస్తూ ఉండేవారు. అయితే రానురాను మారిన పరిస్థితులతో చాలామంది వ్యవసాయాన్ని, పాడి పరిశ్రమను వదిలేశారు. అయితే కేవలం కొద్ది మంది మాత్రమే వీటిని కొనసాగిస్తున్నారు. అయితే వ్యవసాయంలో రానురాను మార్పులు చోటుచేసుకోవడంతో ఇబ్బందికర పరిస్థితుల మధ్య సాగుతోంది. అయితే వ్యవసాయ రంగం మీదే ఆధారపడి ఉన్న పాడి పరిశ్రమల పరిస్థితి ప్రశాంతంగా మారింది. ఈ నేపథ్యంలో అటు వ్యవసాయ రైతులు, ఇటు పాడి రైతులు కష్టనష్టాల మధ్య సతమతమవుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 80 వేలకుపైగా ఎకరాల్లో రైతులు దాళ్వా సాగు చేపట్టారు. ఈ రెండు జిల్లాల్లో 50 శాతం మాసూళ్ల ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే వరి పంట కోతకు ప్రధానంగా యంత్రాలు ఉపయోగిస్తున్నారు. నూటికి 80 శాతం యంత్రాల మీదే వరి కోతలు సాగుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎండుగడ్డి కొరత ఏర్పడింది. సమయం, ఖర్చు ..6లో

ప్రశాంతంగా పాలిసెట్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పరీక్షా కేంద్రాల్లో కమిషనర్ నాగరాణి తనిఖీ

పాలిసెట్ -2024 పరీక్ష శనివారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగినట్లు ఏలూరు జిల్లా కోఆర్డినేటర్ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. జిల్లా కేంద్రమైన ఏలూరులోని 11 సెంటర్లలో జరిగిన పరీక్షలకు మొత్తం 4,055 మందికి 3,418 మంది అంటే 84.3 శాతం హాజరయ్యారని తెలిపారు. దీనిలో బాలురు 2,119 మంది ఉండగా బాలికలు 1,299 మంది ఉన్నారన్నారు. జిల్లాలో మొత్తం 3280 సీట్లు అందుబాటులో ఉన్నాయని, మే 13వ తేదీన ఫలితాలు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. సాంకేతిక విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ సిహెచ్.నాగరాణి, జిల్లా పరిశీలకులు వై.ప్రసాదరావు పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

29న జిల్లాలో పవన్‌కళ్యాణ్ పర్యటన

ప్రజాశక్తి - గణపవరం, తాడేపల్లిగూడెం

జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ఈనెల 29వ తేదీ పశ్చిమగోదావరి జిల్లా గణపవరం, తాడేపల్లిగూడెం ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొనున్నారు. గణపవరంలో సోమవారం సాయంత్రం ఐదు గంటలకు హెలికాప్టర్‌లో పవన్ కళ్యాణ్ గణపవరం చేరుకుంటారని, ప్రధాన సెంటర్ పోలీసు ..6లో

ఉద్దండులున్నా..
సమస్యలు
దండి
మధ్యపేజీల్లో..

ఓటు వేసేటప్పుడు
సెల్ఫీ తీస్తే
కటకటాలే

30న
హేలాపురి
మినీ బాలోత్సవం
8లో..

అక్రమ మద్యం పంపిణీ నిరోధానికి కమిటీలు

పశ్చిమ ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి సుమిత్ కుమార్

అక్రమ మద్యం పంపిణీని నిరోధించేందుకు నియోజవర్గస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికల ఏర్పాట్లపై నియోజకవర్గాల ఆర్‌ఒలతో సమీక్షించి మాట్లాడారు. జిల్లాలో అక్రమ మద్యం నిల్వలు, రవాణా, పంపిణీ ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదన్నారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి టీములు తనిఖీలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. హోమ్ ఓటింగ్ విషయంలో ఇసిఐ నిబంధనలు తుచ తప్పక పాటించాలన్నారు. తెలుగు వర్ణమాల ప్రకారం అభ్యర్థుల పేర్లు క్రమంలో ఫారం-7ఎ రూపొందించాలన్నారు. శనివారం నుండి ఇంటింటికీ ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, రాజకీయ పార్టీలు, వాలంటీర్ల ప్రమేయం ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదని అన్నారు. పంపిణీ చేయగా ఓటర్ స్లిప్పుల మిగిలితే సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అప్పగించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య, డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, ఎన్నికల సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, డిప్యూటీ తహాశీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మే డే వేడుకలను విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కొయ్యలగూడెం పట్టణంలో ఎఐటియుసి ముఠా కార్మికులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మేడే వేడుకలను విజయవంతం చేయాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు ఐక్యంగా హక్కుల సాధనకు నిర్వహించిన సంఘటిత పోరాటాల ఫలితమే నేటి కార్మికుల చట్టాలని తెలిపారు. కార్మికులంతా ఏకమై మేడేను విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెలగా రామారావు, మట్టా రామకృష్ణ, వెలగా నాని, లక్ష్మణరావు, అయినపర్తి మహేష్, మూర్తి, శివ పాల్గొన్నారు.

మేడేను ఘనంగా నిర్వహించాలి

ఏలూరు అర్బన్ :ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే కార్యక్రమాన్ని ఎఐటియుసి, అనుబంధ ఉద్యోగ కార్మిక సంఘాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, కంకిపాటి బుచ్చిబాబు, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక స్ఫూర్తి భవనంలో శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ ఎన్నికల కమిషనర్ మేడే కార్యక్రమాన్ని జరుపుకోవడానికి అనుమతిచ్చారని వారు తెలిపారు.

'జగన్ ఇచ్చేది గోరంత.... దోచేది కొండంత'

ప్రజాశక్తి - నరసాపురం

పేదల కష్టార్జితాన్ని మద్యం ద్వారా జగన్ దోచుకుంటున్నాడని, నాసిరకం మద్యంతో 35 లక్షల మంది ఆరోగ్యాలు నాశనం చేశాడని, జగన్ గోరంత ఇచ్చి కొండంత దోచుకుంటున్నాడని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, పశ్చిమ గోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. తన నివాసంలో శనివారం నిర్వహించిన విలేకర్ల ఆమె మాట్లాడారు. పిన్నమ్మ తాళి తెంచిన నరహంతకుల్ని రక్షిస్తూ, చెల్లికి ఆస్తిలో భాగం ఇవ్వకుండా మోసం చేసి, ఉచితంగా ఇళ్లు ఇస్తానని నమ్మించి మాట తప్పి ఒటిఎస్ పేరుతో ఒక్కో మహిళ నుంచి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు బలవంతంగా వసూలు చేస్తున్న జగన్ రెడ్డి మహిళా ద్రోహి అని విమర్శించారు. మద్యం రేట్లు మూడు రెట్లు పెంచి రూ.2 లక్షల కోట్ల విలువైన నాసిరకం మద్యాన్ని అమ్మారన్నారు. మహిళలపై నేరాలు పెరుగుదలకు జగన్ నాసిరకం మద్యం, గంజాయి, డ్రగ్స్ ప్రధాన కారణాలన్నారు. ఈ కార్యక్రమంలో బండి స్వర్ణలత, తోట భారతి, సుంకర రాజకుమారి, తోట అరుణ, గీత, భవాని, మాధవి పాల్గొన్నారు.

'వైసిపి మేనిఫెస్టోలో బిసిలకు అన్యాయం'

ప్రజాశక్తి - కలిదిండి

వైసిపి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో బిసిలకు ఎటువంటి ప్రయోజనం లేదని టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దుంపలకోడుదిబ్బలో కైకలూరు నియోజకవర్గ స్థాయి అగ్నికుల క్షత్రియుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్నటివరకు బిసిల జపం చేసిన జగన్ నేడు ప్రకటించిన మేనిఫెస్టోలో బిసిలకు ఉపయోగపడే ఒక్క పథకం కూడా ప్రవేశపెట్టలేదన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి'

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజా సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తామనని టిడిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలం రంగాపురం గ్రామంలో శనివారం నిర్వహించిన ఆత్మీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తనపై వస్తున్న వదంతులు నమ్మొద్దని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

పది, ఇంటర్ విద్యార్థులకు బెటర్‌మెంట్ అవకాశం

జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి బెటర్‌మెంట్ కోసం ప్రయత్నించే విద్యార్థులు, ఉత్తీర్ణత సాధించక మరో పరీక్షకు హాజరు కావాల్సిన విద్యార్థులు మే 5వ తేదీ నుంచి పదో తేదీ వరకు ఫీజులు చెల్లించేందుకు ఆన్‌లైన్ పోర్టల్ సిద్ధంగా ఉందని జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలకు 1073 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 74 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 1619 మంది విద్యార్థులు హాజరు కాగా 415 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. పది, ఇంటర్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు జూన్ ఒకటో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు జూన్ పదో తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు పదో తరగతి వారైతే ఒక్కొక్క సబ్జెక్టుకు వంద రూపాయలు, ఇంటర్మీడియట్ వారైతే ఒక్కొక్క సబ్జెక్టుకు రూ.150 ఫీజులు విద్యాశాఖ నిర్ణయించింది. ఆన్‌లైన్ పోర్టల్‌లో అపరాధ రుసుం లేకుండా ఈ నెల 29వ తేదీ నుంచి మే నాలుగో తేదీ వరకు చెల్లించాలని తెలిపారు. మే ఐదో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఒక్కొక్క సబ్జెక్టుకు రూ.25 అపరాధ రుసుంతో చెల్లించాలని పేర్కొన్నారు. మే ఏడో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు ఒక్కొక్క సబ్జెక్టుకు రూ.50 అపరాధ రుసుం, మే తొమ్మిదో తేదీ నుంచి పదో తేదీ వరకు తత్కాల్ పదో తరగతి పరీక్షలకు రూ.500, తత్కాల్ ఇంటర్మీడియట్ పరీక్షలకు రూ.1000 అపరాధ రుసుముతో చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం తెలిపారు.

స్వచ్ఛంద సంస్థల కార్యక్రమాలు వినియోగించుకోవాలి

1న కెరియర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - మండవల్లి

నైపుణ్యాలను పెంపొందించుకునే విధంగా స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సుధామ ఫౌండేషన్ అధినేత ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్ స్పష్టం చేశారు. భైరవపట్నం శుభం ఫంక్షన్ హాలులో విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ కార్యక్రమంపై శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయల్ క్లబ్ ఆఫ్ కైకలూరు సుధామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కెరియర్ గైడెన్స్‌పై మే ఒకటో తేదీన భైరవ పట్టణం లోని శుభం ఫంక్షన్ హాలులో తొమ్మిది గంటలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉన్నత విద్య, ఉద్యోగాలకు కావాల్సిన నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకునే విధంగా అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పది, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరై భవిష్యత్తుకు మంచి బాట వేసుకోవడంతోపాటు స్కాలర్‌షిప్‌లను ఎంచుకునే విధానంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని గత మూడేళ్ల నుంచి ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది కూడా సుధామ ఫౌండేషన్ రాయల్ క్లబ్ ఆఫ్ కైకలూరు ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మెంబర్‌షిప్ కమిటీ ఛైర్మన్ అద్దంకి శ్రీనివాసరావు, కోశాధికారి ఆచంట వెంకటరత్నం, సభ్యులు బొడ్డు శ్రీనివాసరావు, భావిశెట్టి స్వామి, సోదా శ్రీనివాసరావు, కిలారు శ్యాంప్రసాద్, బడే బాబూరావు, చిత్తూరు హరికృష్ణ, శేషగిరి, అల్లాడ పూర్ణచంద్రరావు, సలాది శివ నాగేశ్వరరావు, వడ్లాని నరసింహారావు, చొప్పరపు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఇబి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎఎస్‌పి

సిబ్బందికి పలు సూచనలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ఎస్ఇబి పోలీస్‌స్టేషన్‌ను జిల్లా అడిషనల్ ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటర్ ఫలితాల్లో 470కి 464 మార్కులతో నూజివీడు పట్టణంలో రెండో స్థానంలో నిలిచిన ఎస్ఇబి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కల్పన కుమార్తె లక్ష్మిని వారి ఇంటికి వెళ్లి అభినందించారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన రమణక్కపేటకు చెందిన మనస్వినిని వారి ఇంటికి వెళ్లి అభినందించారు. వారి తల్లిదండ్రులను, విద్యార్థినులను అడిషనల్ ఎస్పీ సూర్యచంద్రరావు, ఎస్ఇబి నూజివీడు సిఐ రమణ సత్కరించారు. అనంతరం ఎస్ఇబి పోలీస్‌స్టేషన్ పరిధిలో సిబ్బందితో, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో అన్ని రకాల కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకోవాలని, నాటుసారా తయారీ కేంద్రాలపై, విక్రయాలపై, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలివస్తున్న మద్యం కట్టడికి తీసుకోవాల్సిన తగిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరులో వైసిపి ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి - ముసునూరు

సిఎం జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలను ఆదుకున్నారని వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరులో వారు శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు, కార్మిక, కర్షకులకు వైసిపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు

కార్యకర్తలకు అండగా ఉంటా

టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి కార్యకర్తల కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని రాఘవపురానికి చెందిన టిడిపి కార్యకర్త పోలగాని సాయి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కుటుంబసభ్యులను రోషన్‌కుమార్ శనివారం కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

టిడిపి కూటమితోనే ప్రజా పరిపాలన

టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజా పరిపాలనకు అద్దం పట్టాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. ఆగిరిపల్లి మండలంలోని వడ్లమాను, చొప్పరమెట్ల గ్రామాల్లో కొలుసు పార్థసారథి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్లిపోతుందన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమన్నారు. ఒక్కసారి తనకు అవకాశం ఇస్తే నూజివీడు నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

2న ముదినేపల్లి మండల సమావేశం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మే రెండో తేదీ గురువారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎన్ఎం.గంగాధరరావు తెలిపారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

వైసిపిని మళ్లీ గెలిపించండి

ఎంఎల్ఎ డిఎన్ఆర్ కోడలు స్వాతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

రానున్న ఎన్నికల్లో వైసిపిని మళ్లీ గెలిపించాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు కోడలు దూలం స్వాతి అన్నారు. మండలంలోని పెదకామనపూడి గ్రామంలో వైసిపి శ్రేణులతో కలిసి ఆమె శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడి వెంకటేశ్వరమ్మ, గంటా సంధ్య పాల్గొన్నారు.

వైసిపిలోకి బాబ్జి

ప్రజాశక్తి - ముదినేపల్లి

కాంగ్రెస్ పార్టీ కైకలూరు నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి మంగినేని నాగవెంకట రామాంజనేయ గాంధీ (బాబ్జి) కాంగ్రెస్ సభ్యత్వానికి రాజీనామా చేసి వైసిపిలో చేరారు. మండవల్లి వైసిపి కార్యాలయంలో ఎంపిపి ఆర్.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు సమక్షంలో వైసిపిలో చేరారు. బాబ్జికి డిఎన్ఆర్ పార్టీ కండువా కప్పి సాదారంగా పార్టీలోకి ఆహ్వానించారు.

వైసిపిలో చేరిక

నూజివీడు రూరల్ : ఆమ్ ఆద్మీ పార్టీ నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ లింగాల సౌజన్య శనివారం వైసిపిలో చేరారు. ఆమెకు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపునకు కృషి చేయాలన్నారు. జగన్ అందించే సంక్షేమ పథకాలను చూసి పలువురు వైసిపిలో చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ తప్పక విజయాన్ని సాధిస్తారన్నారు.

మహారాజశ్రీ నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఏలూరు (జూనియర్ డివిజన్)

O.S. 300/2023 మరియు

I.A. 120/2023 in **O.S. 300/2023**

బిట్వీన్:

జనపరెడ్డి పార్వతి -పిటీషనర్/వాది

మరియు

పంతగాని నిఖిత -రెస్పాండెంట్/ప్రతివాది

పిటిషనర్/వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నంబర్లు గల పిటిషన్‌లో 1వ రెస్పాండెంట్ మరియు దావాలో 1వ ప్రతివాది అయిన పంతగాని నిఖిత, D/o. అందుగుల వసంతకుమారి మరియు (late పంతగాని ఆమోసు), ఫ్లాట్ నెం. 106, 1వ ఫ్లోర్, అద్దంకి పారడైజ్ అపార్ట్‌మెంట్స్, గాలిగోపురం దగ్గర, శనివారపుపేట, ఏలూరు వారికి పై నెంబర్లు గల పిటిషన్ మరియు దావాలో ది. 13-05-2024వ తేదీన ఉదయం 10.30 నిలకు స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరయ్యి తమ ఆక్షేపణలు తెలియపరచు కొనవచ్చును. లేని యెడల సదరు గౌరవ న్యాయస్థానం వారు ఏకపక్షంగా తీర్మానము చేయుదురు అని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

ది.12-04-2024
ఏలూరు

కొఠారి కృష్ణకిషోర్
అడ్వకేట్, ఏలూరు
సెల్: 9948438590

ముఖ్య వార్తలు

ఆదివారం 28 ఏప్రిల్ 2024

చెక్‌పోస్టు వద్ద ఎన్నికల పరిశీలకుల తనిఖీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకుల గూడెం సరిహద్దు వద్ద ఉన్న స్టాటిక్ సర్వేలైన్స్ చెక్ పోస్టును ఎన్నికల పరిశీలకులు కృష్ణకాంత్ పతక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీల తీరును ఆయన పరిశీలించారు. అనంతరం సంబంధిత రిజిష్టర్లను తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి అన్ని వాహనాలను తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి నగదు ఉంటే వాటిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు డిటి సందీప్, విఆర్ఓ అశోక్, చెక్‌పోస్ట్ సిబ్బంది ఉన్నారు.

రూ.1,54,500 స్వాధీనం

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో సరిపల్లి చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో ఇద్దరి వద్ద ఎటువంటి ఆధారాలు, అనుమతులు లేని రూ.1,54,500 సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఎస్‌టి అధికారి లక్ష్మీసరస్వతి తెలిపారు. విప్పర్రు గ్రామానికి చెందిన వసల కనకసుందరం కుమారుడు గంగారాంచంద్రం వద్ద నుంచి రూ.70 వేలు, నిడమర్రు మండలం మందలపర్రు గ్రామానికి చెందిన చిరుతపురి వెంకట రామకృష్ణ వద్ద నుంచి రూ.84,500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మూడో పట్టణ ఇన్‌ఛార్జి సిఐగా ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు మూడో పట్టణ ఇన్‌ఛార్జి సిఐగా రెండో పట్టణ సిఐ ప్రభాకర్ నియమితులయ్యారు. గురువారం రాత్రి అవినీతి నిరోధక శాఖాధికారుల దాడిలో మూడో పట్టణ సిఐ లంచం తీసుకుంటున్న కేసులో అరెస్టయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఇన్‌ఛార్జి సిఐగా రెండో పట్టణ సిఐ ప్రభాకర్‌ను నియమించారు.

దళితునిపై చింతమనేని దాడి హేయం

ఎంఎల్‌ఎ అబ్బయ్యచౌదరి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వైసిపి కార్యకర్తలపై మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ దాడి హేయమని దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. దిబ్బగూడెం ఎస్‌సి కాలనీలో దళితునిపై దాడి చేసిన చింతమనేని ప్రభాకర్‌పై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఏలూరులోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతమనేని గతంలోనూ దళితులపై దాడులు చేశారన్నారు. పోలీసులు చింతమనేనిని అరెస్ట్ చేయాలన్నారు. 93 కేసులున్న చింతమనేని ప్రవర్తనపై ఎలక్షన్ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు ఆనంద్ మాట్లాడుతూ చింతమనేని గతంలోనూ దళితులపై దాడి చేశారని, ఇలాంటివి మానుకోకపోతే తీవ్ర పరిణామాలు చవి చూడక తప్పదన్నారు. ఈ సమావేశంలో వైసిపి ఎస్‌సి సెల్ నాయకుడు కత్తుల రమేష్ జైన్, దెందులూరు జెడ్‌పిటిసి సభ్యులు నిట్టా లీలాకాంతం, వైసిపి నాయకులు ఘంటా ప్రసాద్, కొల్లేరు నాయకులు టి.కొండలరావు, మాదేపల్లి సర్పంచి ప్రభుదేవా పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్

ఆ పార్టీ ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థి గోపాలకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల



ఎన్నికల ప్రచారంలో గోపాలకృష్ణంరాజు

పేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని, రానున్న ఎన్నికల్లో గెలిపించాలని ఆ పార్టీ ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థి వేగేశ్న వెంకటగోపాలకృష్ణంరాజు కోరారు. మండలంలోని కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల్లో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి మతతత్వ రాజకీయాలు రాజ్యాంగ ఉనికిని దెబ్బతీసేవిగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న టిడిపి, వైసిపి ప్రభుత్వాలు రాష్ట్రప్రయోజనాలను తాకట్టు పెట్టారని విమర్శించారు. పిసిసి అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే తొమ్మిది గ్యారెంటీలను ఇచ్చిందని, వాటిలో ప్రధానమైనది ప్రత్యేక హోదా అన్నారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోకా శ్రీనివాస్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సోము నాగబాబు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కొల్లి సత్య శ్రీనివాస్, పార్టీ దొడ్డనపూడి గ్రామ అధ్యక్షులు దుర్గారావు, బొరాడ గోరీనాయుడు, వెంకన్న వాసు, విజయ్, కుమార్, శ్రీను, వెంకటేశులు, బొర్రా పార్థ పాల్గొన్నారు.

వైసిపి పాలనతో అందరికీ మేలు

ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి శ్రీరంగనాథరాజు



ఎన్నికల ప్రచారంలో శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - పెనుమంట్ర

వైసిపి హయాంలో పార్టీలకు, కులమతాలకు అతీతంగా అన్ని తరగతులకు మేలు జరిగిందని, మరింత మేలు జరగాలంటే మరోసారి వైసిపిని గెలిపించాలని ఆ పార్టీ ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కోరారు. మండలంలోని నెగ్గిపూడి, వనంపల్లి గ్రామాల్లో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానులు ఎంఎల్‌ఎకు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెంది సుభిక్షంగా ఉండాలన్నా జగనే మళ్లీ సిఎం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర ఎంపిపి కర్రి వెంకటనారాయణ(వాసు)రెడ్డి, నెగ్గిపూడి అల్లం(బ్రదర్స్) బుల్లిరెడ్డి, భాస్కర రెడ్డి, పాలవలస రెడ్డి, కర్రి త్రిమూర్తులు సన్న పాల్గొన్నారు.

వైసిపి గెలుపే రాష్ట్రాభివృద్ధికి మలుపు

ఈ ఎన్నికల్లో వైసిపి గెలుపు ద్వారా రాష్ట్రాభివృద్ధికి మలుపు అవుతుందని ఆ పార్టీ ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని సత్యవరం గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను కలిసి మాట్లాడారు. ఈ ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలన్నారు. నరసాపురం ఎంపీ అభ్యర్థి ఉమాబాలను, ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి, సత్యవరం, నెగ్గిపూడి, వనంపల్లి వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జల్లి కాకినాడలో ధర్మరాజు ప్రచారం

ప్రజాశక్తి - గణపవరం



ఎన్నికల ప్రచారంలో ధర్మరాజు

జనసేన ఉంగుటూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి ధర్మరాజు మండలంలోని జల్లి కాకినాడలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మరాజు ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. తనను గెలిపిస్తే గ్రామీణ ప్రాంత సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ ప్రచారంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి విజయరాజు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి - చింతలపూడి

జగనన్న సంక్షేమ పథకాలు చూసి ప్రజలు వైసిపిలో చేరుతున్నారని, వైసిపికి ప్రజల ఆశీర్వాదాలు ఉన్నాయని ఆ పార్టీ చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. మండలంలోని రేచర్ల పంచాయతీలో గత ఎన్నికల్లో టిడిపి తరపున సర్పంచిగా పోటీ చేసిన ఉలాస శ్రీనివాసరావు, టిడిపి వార్డు మెంబర్ రాణి, మరో 30 కుటుంబాలు వైసిపిలో చేరారు. వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరుముచ్చు గోపాల్‌యాదవ్ సమక్షంలో వైసిపి మండలాధ్యక్షులు జగ్గవరపు జానకిరెడ్డి ఆధ్వర్యంలో వారు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కంభం విజయరాజు మాట్లాడుతూ అందరం కష్టపడి పనిచేసి జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా, రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా మళ్లీ వైసిపి ప్రభుత్వం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బాణవత్ రాంబాబు, సర్పంచి శివరామకృష్ణ, నాయకులు వెంకట్రామిరెడ్డి, మాధవరావు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో నశించిన ప్రజాస్వామ్యం

టిడిపి ఏలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఛార్జ్‌షీట్ ఆవిష్కరిస్తున్న బడేటి చంటి

వైసిపి హయాంలో రాష్ట్రంలో టెర్రరిజం ఎక్కువై ప్రజాస్వామ్యం నశించిందని టిడిపి ఏలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి బడేటి చంటి అన్నారు. అరాచక పాలన అంతం-కూటమి పంతం అంశంపై బడేటి చంటి స్థానిక పవర్‌పేటలోని టిడిపి కార్యాలయంలో శనివారం ప్రెస్‌మీట్ నిర్వహించి మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రజలందరూ కూటమిని ఎన్నుకోవాలనే ఉద్దేశంతో ఛార్జ్‌షీట్‌ను విడుదల చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో రాజకీయ హింసలు, అక్రమ అరెస్టులు పెరిగిపోయాయన్నారు. పెన్షన్ విషయంలో మూడు రోజులు ఆలస్యం చేసి తెలుగుదేశం పార్టీపై ఎటువంటి బురదజల్లారో అందరూ గమనించాలన్నారు. కరెంట్ ఛార్జీలను తొమ్మిది సార్లు పెంచారన్నారు. రానున్న రోజుల్లో టిడిపి కూటమి అధికారంలోకొస్తుందని, ప్రజలకు మంచి రోజులు రాబోతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం పేరుతో వైసిపి నాటకాలు

ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ప్రచారంలో కృష్ణతులసి, ప్రవీణ

సంక్షేమం పేరుతో వైసిపి ప్రభుత్వం నాటకాలు చేస్తుందని టిడిపి తణుకు ఎంఎల్‌ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి అన్నారు. అత్తిలిలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో ఆమెతో పాటు బిజెపి నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ సతీమణి వెంకటేశ్వరి దేవి(ప్రవీణ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ తులసి మాట్లాడుతూ సిఎం జగన్ ఒక చేత్తో ఇస్తూ కొంత ఇచ్చి మరో చేత్తో అంతా లాగేస్తున్నారన్నారు. వైసిపి హయాంలో విద్యుత్ ఛార్జీలు పెరిగిపోయాయన్నారు. ఎంపి ప్రవీణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనాల ఆదినారాయణ, సత్యనారాయణ, పోలిశెట్టి చంటి, కేత పద్మావతి, రాంబాబు, దాసం ప్రసాద్, తోట త్రిమూర్తులు పాల్గొన్నారు.

'ఓట్లు అడిగేందుకు జగన్ అనర్హుడు'

తణుకు రూరల్ : సిఎం జగన్ ప్రజలను ఓట్లు అడిగేందుకు అనర్హుడని టిడిపి తణుకు ఎంఎల్‌ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులతో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. జగన్ పాలనపై ఎన్‌డిఎ కూటమి రూపొందించిన ఛార్జ్‌షీట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ జగన్ విధానాలపై కొన్ని ప్రశ్నలు లేవనెత్తారు. ఐదేళ్ల కాలంలో నాశనం, అరాచకం తప్ప ఒక్క మంచి పని చేయని జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొమ్మేటి వెంకటసుధాకర్, బసవ రామకృష్ణ, కలగర వెంకటకృష్ణ, నల్ల భాస్కరరావు, బిజెపి నాయకులు అయినంపూడి శ్రీదేవి, కొమ్మిరెడ్డి శ్రీనివాస్, చిక్కాల వేణు, తాతపూడి మారుతీరావు పాల్గొన్నారు.

'టిడిపి కూటమితోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్రాభివృద్ధి టిడిపి కూటమితోనే సాధ్యపడుతుందని జూనియర్ పవన్ కళ్యాణ్ (రాజేంద్రప్రసాద్) అన్నారు. మండలంలోని కలిగొట్ల, ఆరేడు, ఉప్పులూరు, కోలమూరు, పాములపర్రు, పెదపుల్లేరు, కలిసిపూడి, చెరుకువాడ గ్రామాల్లో జనసేన మండలాధ్యక్షులు యడవల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో జూనియర్ పవన్ కళ్యాణ్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి గురించి ఆలోచించిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ టిడిపితో పొత్తు పెట్టుకున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే సీట్లు త్యాగం చేశారన్నారు. టిడిపి అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు యర్రా రవి, కుచ్చు శివకృష్ణ, కుంటి అప్పారావు, ఆరేపల్లి వెంకటేష్, కంకణాల బాలకృష్ణ, సబ్బవరపు మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

ఆర్‌ఒ, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

రాజకీయ పార్టీలు, పోటీలో నిలిచే అభ్యర్థులు ప్రకటనలు జారీ, ప్రచార వీడియోలను జారీ చేసే సమయంలో జిల్లా మీడియా సమన్వయ పర్యవేక్షణ కమిటీ ద్వారా తప్పనిసరిగా ఆమోదం పొందాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఆయా నియోజకవర్గాల నుంచి పోటీలో నిలిచేందుకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని, ఈ క్రమంలో పోటీలో నిలిచే అభ్యర్థులు ప్రకటనలు జారీ, ప్రచార వీడియోలను చిత్రీకరించి వివిధ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళిని, మార్గదర్శకాలను అనుసరించి కచ్చితంగా ముందస్తు అనుమతి మేరకు వాటిని ప్రచారం చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వీడియో వాహనాలలో ప్రచారం చేసే విధానంలో ప్రదర్శిస్తున్న వీడియో క్లిప్స్ కోసం ముందస్తు అనుమతి పొందడంతోపాటు ఆయా వివరాలూ కూడా వీడియోలో చూపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. లోకల్ ఛానల్స్, శాటిలైట్ ఛానళ్ల తదితర విభాగాల్లో ప్రచారం కోసం అనుమతులు తప్పనిసరి అని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ప్రచారం నిర్వహిస్తే వాటిపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద పరిగణించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ముందస్తు అనుమతి పొందకుండా ఉంటే అటువంటి వారిపై ఉల్లంఘన కింద రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

సేవకుడే నాయకుడు కావాలి

రోషన్‌కుమార్ సతీమణి విజయ ప్రచారం

ప్రజాశక్తి - చింతలపూడి

సేవకుడే నాయకుడు కావాలని, సేవ చేసే వారిని నాయకుడుగా ఎన్నుకోవాలని సొంగా విజయ రోషన్ అన్నారు. చింతలపూడిలోని ఆంథోనీ నగర్ కాలనీలో టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ సతీమణి సొంగా విజయ శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి కూటమిని ఆశీర్వదించాలని, ఎంఎల్ఎ, ఎంపీ అభ్యర్థుల సైకిల్ గుర్తుపై ఓటు వేసి వారిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.



ప్రచారం చేస్తున్న సొంగా విజయ

చింతలపూడిలోని గంటావారివీధిలో పట్టణాధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్ దొడ్డిగర్ల ప్రభాకర్, అడ్డాల రవి, గణేశ్వరరావు, గంటా నాగభూషణంతో కలిసి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను, ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కొన్ని ఏరియాల్లో డ్రెయినేజీలు లేక ఇళ్లల్లోకి మురుగునీరు వెళ్తోందని, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గంటావారివీధిలో 2 రోజులకు ఒకసారి అది కూడా గంట మాత్రమే తాగునీరు సరఫరా అవుతోందని స్థానికులు నాయకుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ బోడా అనీష్ కుమార్, జనసేన మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు, జిల్లా రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, సీనియర్ నాయకులు తాటి అప్పారావు, తిరుమిల్లి రామారావు, మన్యం సత్తిబాబు, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి తూము విజయ్, బిజెపి నాయకులు తోట నారాయణ పాల్గొన్నారు.

భీమవరంలో కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎన్నికల్లో ఇండియా వేదిక బలపర్చిన అభ్యర్థుల విజయం ఖాయమని కాంగ్రెస్ నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి కెబిఆర్.నాయుడు అన్నారు. శనివారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కెబిఆర్.నాయుడు, భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి అంకెం సీతారామ్ భీమవరంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ మే 13న జరగబోయే ఎన్నికల్లో ఇండియా వేదిక విజయం సాధిస్తుందన్నారు. దేశంలో బిజెపి చేస్తున్న అరాచకాల వల్ల ప్రజలు విసుగు చెందారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 9 పథకాలు ప్రజల్లోకి వెళ్లాలన్నారు. బిజెపి పాలనలో ప్రజలకు భద్రత లేదన్నారు. వెనుకబడిన సామాజిక తరగతుల వారికి న్యాయం జరగాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపన సుబ్రహ్మణ్యరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి సోడాదాసి గంగయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సోము నాగ కేశవ్‌బాబు, జిల్లా స్టూడెంట్ అధ్యక్షులు చింతగుంట మహేష్ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి నాయుడు, ఎంఎల్ఎ అభ్యర్థి సీతారామ్

వైసిపి అరాచక పాలనను అంతమొందించాలి

టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి అరాచక పాలనను అంతమొందించాలని మాజీ మంత్రి, టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం పోడూరు మండలం కొమ్ముచిక్కాలలో ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్‌డిఎ ఛార్జిషీట్ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలా వెనక్కి నెట్టారన్నారు. రాష్ట్రంలో కబ్జాలు, దోపిడీలతో ప్రజలు నిత్యం భయంతో జీవించారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సబ్ప్లాన్ నిధులను లక్షల కోట్లు దారి మళ్లించి నవరత్నాలతో నవ మోసాలు చేశారని విమర్శించారు. బిజెపి పరిశీలికుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ల్యాండ్ మాఫియా, సేన మాఫియా, మైనింగ్ మాఫియా, గంజాయి, డ్రగ్స్ తదితర వాటిపై రూ.ఎనిమిది లక్షల కోట్ల రూపాయలు కొట్టేసిన జగన్‌పై ఎన్‌డిఎ ఛార్జిషీట్ వేయాలన్నారు. మాజీ ఎంఎల్‌సి మల్లుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సబ్‌ప్లాన్ నిధులను లక్ష కోట్లు దారి మళ్లించారని విమర్శించారు. జనసేన మండల అధ్యక్షులు బాలాజీ నాయుడు మాట్లాడుతూ ప్రాజెక్టుల పేరుతో జగన్ అవాస్తవాలను వాస్తవాలుగా తన మీడియా ద్వారా మాయ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ ఐదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ తెచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు.

ఎన్‌డిఎ ఛార్జిషీట్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పితాని సత్యనారాయణ

సార్వత్రిక సంగ్రామం

ఉద్దండులున్నా..

సమస్యలు దండి..!

ప్రధాన సమస్యలతో జనం విలవిల

ఉండి వంతెన సెంటర్, ఆకివీడుల్లో ట్రాఫిక్ చిక్కులు

నీరు కొనుగోలు చేయనిదే తడవని గొంతు

ఉద్దండుల నిలయం ఉండిలో సమస్యలు దండిగానే పేరుకుపోయాయి. ఇక్కడ నుంచి ప్రముఖులు రాష్ట్ర శాసనసభకు ఎన్నికైనా.. మంత్రివర్గంలో స్థానం సంపాదించినా కొన్ని సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. ఆయా సమస్యలు ఎన్నికల సమయంలోనే నేతల ప్రచారంలో ప్రస్తావనకు రావడం, ఆపై వాటిని మరువడం సర్వసాధారణమైంది. గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాల హయాంలో ఏం జరిగింది.. ఏం జరగలేదు అనేదే ఇప్పుడు కీలకంగా మారింది. పాలకుల తీరుతో ప్రజా, స్థానిక సమస్యలకు ప్రాధాన్యత లేకుండా పోవడంతో జనం నానా అవస్థలు పడుతున్నారు.

కాళ్ల : సుదూర ప్రాంతాల నుంచి బిందెలతో తాగునీరు తెచ్చుకుంటున్న మహిళలు

ఫోకస్

ప్రజాశక్తి - కాళ్ల, ఉండి, ఆకివీడు, పాలకోడేరు

ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు స్థానిక ప్రజా, రైతు సమస్యలపై మాట్లాడుతున్న దాఖలాల్లేవు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో సంక్షేమం చూసి ఓటు వేయాలని వైసిపి అభ్యర్థి పివిఎల్. నరసింహరాజు కోరు తుండగా, టిడిపి అభ్యర్థి రఘు రామకృష్ణంరాజు జగన్ పాలనపై విమర్శలు ఎక్కుపెడుతూ తమ మేని ఫెస్టోతో ప్రచారం చేస్తున్నారు. ఉండి అసెంబ్లీ స్థానానికి జరుగుతున్న ఎన్నికలను గోదావరి జిల్లావాసుల పౌరు షానికి, జగన్ అహంకారానికి మధ్య జరుగుతున్న యుద్ధంగా రఘు రామకృష్ణంరాజు అభివర్ణించడం కొసమెరుపు.

ఆకివీడు మండలం తాళ్లకోడేరు కాలనీవాసుల ఆదోళననుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం(ఫైల్‌ఫొటో)

నియోజకవర్గంలో వరి, ఆక్వా ప్రధాన పంటలుగా ఉన్నాయి. తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కొల్లేరు మూడో కాంటూరుకు కుదింపు, ఉప్పుటేరు ముంపు, వెంకయ్య, వయ్యేరు పైపులైను రూ.30 కోట్ల ప్రాజెక్టు పనులు అసంపూర్ణంగా ఉండటం జనాన్ని వేధిస్తున్నాయి. పంట, మురుగు కాలవల ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో వరి, ఆక్వా రైతులు ఏటా నష్టపోతున్నారు. పంట, మురుగు కాలువల అభివృద్ధి పనులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాల్సిన ఉండగా ఆ దిశగా చర్యలే శూన్యం. ఆకివీడు నగర పంచాయతీలో డంపింగ్ యార్డు సమస్య తీవ్రంగా ఉంది.

ఆక్వా రంగం నుంచి వచ్చే వ్యర్థాల వల్ల పంట కాలువలు, తాగునీటి చెరువులు, బోదెలు, భూగర్భ జలాలు, బావులు కలుషితమై తాగునీటి కోసం స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రజలు తాగునీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. బావుల్లో ఉప్పునీరు కనీసం వాడకానికి పనికిరాకుండా పోతోంది. సముద్ర తీర ప్రాంతం కావడంతో భూగర్భ జలాలు పూర్తిగా ఉప్పుమయమైపోయాయి. నియోజకవర్గంలో ఆక్వా రంగం గణనీయంగా విస్తరించడంతో అన్ని ప్రాంతాలకూ స్వచ్ఛమైన తాగునీరు ఉండటం లేదు. సుజల స్రవంతి ఆర్ఒ తాగునీటి పథకాలను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆక్వా ఉత్పత్తులు ఏటా పెరుగుతున్నా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న కోల్డ్ స్టోరేజీల హామీని నెరవేర్చాలని ఆక్వా రైతులు కోరుతున్నారు. రహదారులు అధ్వానంగా ఉండగా వంతెనలు శిథిలావస్థకు చేరాయి. కోపల్లె వద్ద నూతన వంతెన నిర్మాణం మాటలకే పరిమితమైంది.

కాళ్ల మండలం కలవపూడిలో రెండో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి 2014లో శంకుస్థాపన జరిగినా ఇప్పటివరకు ఎటువంటి పనులూ జరగలేదు. పదేళ్లయినా నిర్మాణ పనులు మొదలు కాలేదు. కాళ్ల పిహెచ్‌సి నూతన భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఉండి, కాళ్ల మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటు ఇప్పటికీ కలగానే మిగిలిపోయింది. పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసినా నిర్మాణ వ్యయం పెరగడంతో లబ్ధిదారులు అప్పు చేసి నిర్మాణాలు చేపట్టి బిల్లులు అందక అవస్థలు పడుతున్నారు. ఉండి అక్విడెక్ట్, పంట, మురుగు కాలవలు, లాకులు, షట్టర్ల ఆధునికీకరణ పనుల సంగతి వేసవిలోనూ మరిచారు.

పాలకోడేరు మండలం మోగల్లులో నిర్మాణంలో ఉన్న అల్లూరి స్మృతివనం

కాలనీ ఇచ్చారు.. సౌకర్యాలు మరిచారు

తాళ్లకోడు కాలనీలో పెద్దసంఖ్యలో ఇళ్లు మంజూరు చేశారు. పేదలపై ఒత్తిడి తెచ్చి ఇళ్లు నిర్మించుకునేలా చేశారు. అయితే వీధి దీపాలు, డ్రెయిన్లు, రోడ్లు, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాల కల్పన సైతం మరిచారు. దీనికితోడు దొంగల బెడద పెరగడంతో జనం బెంబేలెత్తారు. సిపిఎం ఆధ్వర్యాన ప్రజలు వివిధ రూపాల్లో ఆందోళనలు చేసిన ఫలితంగా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని కొన్ని సమస్యల నుంచి తాత్కాలిక ఉపశమనం కల్పించారు. ఆయా సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. నగర పంచాయతీగా గ్రేడ్ మారినా సౌకర్యాల కల్పన మాత్రం పంచాయతీకన్నా తక్కువగానే ఉన్నాయని జనం లబోదిబోమంటున్నారు. ఇక ఈ మండలంలో కొల్లేరు వాసుల సమస్యలు చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న సంగతి తెలిసిందే.

ఉండి పెదవంతెన సెంటర్‌లో స్తంభించిన ట్రాఫిక్ (ఫైల్‌ఫొటో)

ఇక మండల కేంద్రమైన ఉండిని ట్రాఫిక్ సమస్య వట్టివీడిస్తోంది. ప్రధాన కూడలిలో ఉన్న వంతెన సెంటర్‌లో ట్రాఫిక్ తరచూ స్తంభిస్తోంది. ఓపక్క బస్టాండ్, మరోవైపు భీమవరం నుంచి ఆకివీడు వైపు వంతెన పైనుంచి మలుపు తిరగడం ఇబ్బందికరంగా మారడంతో తరచూ ఆకివీడు, ఉండివైపు ట్రాఫిక్ స్తంభిస్తోంది. అలాగే ఉండి - ఆకివీడు మార్గంలో ఉండి ప్రవేశంలో ఉన్న రైల్వేగేటు వద్ద నిర్మిస్తున్న ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. చాలాగ్రామాలకు ఈ మండలంలో రవాణా సౌకర్యమూ లేదు.

ఇక పాలకోడేరు మండలం అంటే గుర్తొచ్చేది అల్లూరి సీతారామరాజు. ఆయన స్వగ్రామం మోగల్లు ఈ మండలంలోనే ఉంది. ఆయన పేరిట ఆ గ్రామాన్ని అభివృద్ధి చేసినట్లు హడావుడీ చేయడం మినహా కార్యరూపం దాల్చలేదు. గ్రామంలో అల్లూరి స్మృతివనం కూడా క్షత్రియ సేవా సమితి నిర్మించి అభివృద్ధి చేస్తోంది. ఈ మండలంలో జాతీయ రహదారిపై పాలకొల్లు-భీమవరం నడుమ శృంగవృక్షం వద్ద ఉన్న రైల్వేగేటు వల్ల తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈ మార్గంలో ప్రయాణం అంటేనే అందరికీ తొలుత గుర్తొచ్చేది శృంగవృక్షం రైల్వే గేటు. ఇక్కడ ఓవర్‌బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో బైపాస్ రోడ్డు నిర్మిస్తామని పాలకులు ప్రకటించడంతో సమస్య పరిష్కారమవుతుందని అంతా భావించారు. అయితే ఈ సమస్య పరిష్కార దిశగా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఈ మండలంలోని డెల్టా పేపర్ మిల్లు మూతపడడంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. కార్మిక సంఘాలు, వామపక్షాలు, ప్రధానంగా సిఐటియు ఈ మిల్లును తెరవాలని పోరాడాయి తప్ప అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు మాత్రం స్పందించిన దాఖాలాల్లేవు. మరి ఈ సమస్యలపై ఈ ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

ఓటు వేసేటప్పుడు సెల్ఫీ తీస్తే కటకటాలే..

పోలింగ్ కేంద్రంలో సెల్‌ఫోన్ నిషేధం

మీకు తెలుసా..

ఇది సెల్ఫీల కాలం. కాదేదీ సెల్ఫీలకు అనర్హం అన్నట్టు కొంతమంది యువత ఇష్టం వచ్చినట్లు సమయం, సందర్భం పాటించకుండా సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఓటువేసే సమయంలో సరదాపడి సెల్ఫీ తీశారో ఇక అంతే సంగతులు. మీ ఓటు రద్దు అవ్వడమే కాదు. జైలుకు కూడా వెళ్లాల్సి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ కేంద్రానికి సెల్‌ఫోన్ తీసుకెళ్లడమే నేరం. పోలింగ్ కేంద్రంలో ఫొటోలు, వీడియోలు తీయడం నిషేధం. ఓటరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు, భద్రత దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఈ నిబంధనలను కఠినతరం చేసింది. యువతకు సెల్ఫీల పిచ్చి ఎంతగా ముదిరిందో చెప్పడానికి తార్కాణం ఈ ఘటన. ఓటు వేసేటప్పుడు గోప్యత పాటించాలని ఎన్నికల నియమావళి చెబుతోంది.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

ఎస్.కొండేపాడులో కాంగ్రెస్ అభ్యర్థి హరికుమార్ ప్రచారం

ప్రజాశక్తి - గణపవరం

మత విద్వేషాలను రెచ్చగొట్టి దేశ ఐక్యతకు భంగం కలిగిస్తున్న బిజెపిని, దాన్ని బలపరుస్తున్న పార్టీలను ఓడించి ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ శనివారం కాంగ్రెస్ ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పాతపాటి హరికుమార్‌రాజు ఎస్.కొండేపాడులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరి కుమార్ రాజు సిపిఎం కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు జి.చంద్రశేఖరరావు, సిపిఎం కార్యకర్తలు పి.నరసింహమూర్తి, ఎం.పెంటారావు, జి.శ్రీను, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్.కొండేపాడులో ప్రచారం చేస్తున్న హరికుమార్ రాజు

హరికుమార్ రాజును గెలిపించాలి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉంగుటూరు నియోజకవర్గ ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి పాతపాట హరికుమార్‌రాజును గెలిపించాలని కోరుతూ శనివారం సిపిఎం గణపవరం మండల కమిటీ ఆధ్వర్యంలో కేశవరం, అప్పన్నపేట, మలపరాజుపేట గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పిచ్చెట్టి నరసింహమూర్తి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి దగాకోరు మాటలతో ప్రజలను మోసం చేస్తోందన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపితో పొత్తు పెట్టుకుని ఏదో విధంగా అధికారంలోకి రావాలని ప్రయత్నాలను తిప్పి కొట్టాలన్నారు. బిజెపి దగాకోరు విధానాలకు అనుకూలంగా రాష్ట్రంలో వైసిపి ఉందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని ఆ పార్టీని బలపర్చే పార్టీలను ఓడించి మత సామరస్యం, దేశ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు మేడిశెట్టి పెంటారావు, గుత్తుల శ్రీనివాసు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తాం

భారత చైతన్య యువజన పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి వెంకటస్వామి

ప్రజాశక్తి - నరసాపురం

తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాగునీరు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరిస్తామని భారత చైతన్య యువజన పార్టీ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ఆకుల వెంకటస్వామి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తనను ఎంఎల్ఎగా గెలిపిస్తే నియోజకవర్గంలోని సమస్యలను అసెంబ్లీలో చర్చించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటానన్నారు. వశిష్ట వారధి, డంపింగ్ యార్డు సమస్యలు పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మెరుగైన రోడ్ల నిర్మాణం, మహిళల స్వయం ఉపాధి, రక్షణ కల్పిస్తామన్నారు. లేసు, కొబ్బరి పీచు పరిశ్రమల అభివృద్ధి, మార్కెటింగ్‌కు చర్యలు తీసుకుంటామన్నారు. పర్యాటకంగా నరసాపురం నియోజకవర్గ వర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. యువత భవిష్యత్తు తమ బాధ్యత అన్నారు. కార్మికులు, రైతులు, బలహీన వర్గాలు, ఉద్యోగులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. చెరకు రైతు గుర్తుకు ఓటువేసి ఎంఎల్ఎగా తనను గెలిపించాలని కోరారు. నరసాపురం నియోజకవర్గంపై తనకు పూర్తి అవగాహన ఉందని ఆకుల వెంకటస్వామి అన్నారు.



కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి - నిడమర్రు

వాగ్దానాల అమలు చేయలేని పార్టీలను ఓడించి, ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని శనివారం నేతలు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ కొల్లేరు సమస్యను పరిష్కరిస్తామన్నారు. హామీలిచ్చి అధికారంలోకొచ్చిన ప్రభుత్వాలు, పార్టీలు ఆ మాటే మరిచారని తెలిపారు. పెట్రోల్, గ్యాస్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని దానికి మద్దతు పలుకుతున్న పార్టీలను ఓడించాలని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గౌర సత్యనారాయణ, వి.మోహన్, శ్రీనివాసు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నేతలు

ప్రచారం చేస్తున్న బుజ్జి

నరసాపురంలో కాంగ్రెస్ అభ్యర్థి బుజ్జి ప్రచారం

నరసాపురం: బిజెపి ప్రభుత్వంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయని కాంగ్రెస్ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి ఉదయభాస్కర కృష్ణ ప్రసాద్ (బుజ్జి)అన్నారు. శనివారం పట్టణంలోని ఆటో, రిక్షా స్టాండ్ కార్మికులను కలిశారు. వారి ఇబ్బందులను అడిగి తెలుసుకుని మాట్లాడారు. కరోనా తర్వాత చాలా మంది నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల ఆటో డ్రైవర్లు చాలా నష్టాలు చూస్తున్నారన్నారు. ప్రభుత్వంలో కోట్ల మంది ఉండగా ఏదో కొద్ది మందికి సంక్షేమ పథకాలిచ్చి అన్నీ చేశామని ప్రచారాలు ద్వారా ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఓడించాలని హస్తం గుర్తుపై ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది చేగొండి బాలాజీ, మల్లిపూడి శ్రీనివాస్, సాధనాల పుల్లయ్య, నాయుడు, సోడాదాసి శ్రీధర్, పోతురాజు పాల్గొన్నారు.

1 వరకూ పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగింపు

జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ గడువును మే1 వరకూ పొడిగించడం జరిగిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగి ఏ జిల్లాలో, ఏ నియోజకవర్గంలో ఓటరుగా నమోదైనా తాను విధులు నిర్వర్తిస్తున్న ప్రాంతంలోని ఫెసిలిటేషన్ సెంటర్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బందికి పోలింగ్ రోజు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉండదు కాబట్టి వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు పోలింగ్ కంటే ముందుగానే ఓటుహక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఫారమ్-12 దరఖాస్తులను పూర్తిచేసి ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, ఓటర్ గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీలను జత చేసి సంబంధిత ఎఆర్‌ఒకు అందజేయాలని పేర్కొన్నారు. వాటిని అధికారుల సొంత నియోజకవర్గానికి పంపిస్తారని తెలిపారు. ఒక జిల్లాలో విధుల్లో ఉన్న ఉద్యోగికి మరో జిల్లాలో ఓటు ఉంటే తాను పనిచేస్తున్న జిల్లా కేంద్రంలోని ఫెసిలిటేషన్ సెంటర్లో ఈ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కోసంఉద్యోగులకు ప్రత్యేకంగా ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షిస్తున్న సుమిత్‌కుమార్

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు ఎం.దీప, ఎల్.నిర్మల్‌రాజ్ పర్యవేక్షణలో పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం నియోజవర్గాల జనరల్ అబ్జర్వర్ ఎం.దీప, తణుకు, తాడేపల్లిగూడెం, ఉండి నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్ ఎల్.నిర్మల్‌రాజ్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ సంయుక్తంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై నియోజకవర్గాలవారీగా ఎన్నికల విధుల్లో పాల్గొనే పిఒలు, ఎపిఒలు, ఒపిఒలు రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య, ఎన్నికల సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాదు, డిప్యూటీ తహాశీల్దారు ఎం.సన్యాసిరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు గూడూరి జగదీష్ కుమార్, కామన నాగేశ్వరావు (వైసిపి), పాకా సత్యనారాయణ, కోమటి రవికుమార్ (బిజెపి), మరపట్ల శ్యాంబాబు (టిడిపి), కాటూరి కరుణాకర్(బిఎస్‌పి), తమలంపూడి వంశీ శ్రీనివాసరెడ్డి (కాంగ్రెసు), జెఎన్‌వి.గోపాలన్ (సిపిఎం) పాల్గొన్నారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ సమర్థవంతంగా నిర్వహించాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

సాధారణ ఎన్నికలకు సంబంధించి ప్రతి ఓటరుకూ షెడ్యూల్ ప్రకారం ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులు, బిఎల్‌ఒలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇంటింటికీ ఓటరు స్లిప్‌ల పంపిణీలో ఎలాంటి పొరపాట్లకూ తావు లేకుండా చూడాలన్నారు. సంబంధిత ఓటరు స్లిప్పులు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ బిఎల్‌ఒల ద్వారా అందజేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటుహక్కును తప్పక వినియోగించుకోవాలని కోరారు.

ప్రచారం చేస్తున్న కనుమూరి రమాదేవి

'ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం'

ప్రజాశక్తి - ఉండి

రోజు రోజుకూ పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కనుమూరి రమాదేవి విమర్శించారు. శనివారం ఉండి గ్రామంలోని భవానీపేట, రామాపురం, పులిగుమ్మ, అరుంధతి పేట తదితర ప్రాంతాల్లో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కనుమూరి రమాదేవి మాట్లాడారు. విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఆర్‌టిసి ఛార్జీలు ఇతర రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలోనే అధికంగా ఉన్నాయన్నారు. ధరలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టిడిపి ఉండి నియోజకవర్గ అభ్యర్థి కనుమూరి రఘు రామకృష్ణంరాజును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గవరలక్ష్మి అనిల్, నాయకులు పొత్తూరి వెంకటేశ్వరరాజు, ఉండి మాజీ సర్పంచి ముదునూరి విజయ కృష్ణంరాజు, మండల మాజీ ఉపాధ్యక్షురాలు మంతెన కృష్ణకుమారి సాయిరాజు, మాజీ ఎంపిటిసి పెద్దింటి నాగలక్ష్మి, జయలక్ష్మి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని శిక్షణా నైపుణ్యమే విద్యార్థికి బాసట

ప్రజాశక్తి - కలిదిండి

విద్యలో ఉపాధ్యాయుని శిక్షణా నైపుణ్యమే విద్యార్థికి బాసటగా నిలుస్తుందని ప్రొఫెసర్ ఆర్‌ఒఎల్.శర్మ అన్నారు. స్థానిక వివేకానంద హై స్కూల్ వద్ద అప్సా డెమోక్రటిక్ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యునికేషన్ స్కిల్స్‌పై శిక్షణా కార్యక్రమం జరిగింది. 17 పాఠశాలల నుండి సుమారు 200 మంది ఉపాద్యాయులు శిక్షణ పొందినట్లు అప్సా డెమోక్రటిక్ జిల్లా గౌరవాధ్యక్షులు చన్నంశెట్టి కృష్ణ తెలిపారు. ప్రత్యేక అతిథిగా కాటూరి సిద్ధార్థ హైస్కూల్ కరెస్పాండెంట్ ఎ.అర్జున్‌రావు పాల్గొన్నారు. అనంతరం ఆర్‌ఒఎల్ శర్మను ఘనంగా సన్మానించారు.

11 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని పలు సచివాలయాల్లో పదకొండు మంది వాలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపిడిఒ ఎంవి.రమణరావు తెలిపారు. పసలదీవిలో పది మంది, రుస్తుంబాదలో ఒకరు మొత్తం 11 మంది వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేసినట్లు రమణరావు తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఒ అచ్యుత్ అంబరీష్

ఆర్‌ఒచే స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఇవిఎంలను భద్రపర్చిన స్థానిక వైఎన్ కళాశాలలో స్ట్రాంగ్ రూములను నరసాపురం నియోజకవర్గ ఆర్‌ఒ ఎం.అచ్యుత్ అంబరీష్ శనివారం పరిశీలించారు. సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. భద్రతా సిబ్బందితో మాట్లాడారు. ఎటువంటి ఇబ్బందులొచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట నరసాపురం తహశీల్దార్ ఎన్‌ఎస్‌ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు సేవచేయడమే మానవత లక్ష్యం

రీజనల్ మేనేజర్ వి.చంద్రయ్య

ప్రజాశక్తి - పోలవరం

పేదలకు సేవా చేయాలనే సంకల్పంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ముందుకెళ్లోందని సంస్థ రీజనల్ మేనేజర్ వి.చంద్రయ్య అన్నారు. మానవత సంస్థ సమీక్షా సమావేశం విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత ద్వారా అగ్నిప్రమాద బాధితులకు, వైద్య సహాయం, అవసరమైన పేదలకు, చదువుకునే ఆర్థిక స్తోమత లేని పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. మానవత సంస్థను స్థాపించి 20 సంవత్సరాలు పూర్తయిందని చెప్పారు. ప్రతినెలా సేవా కార్యక్రమంలో భాగంగా ఐదువేల రూపాయల చొప్పున సహాయాన్ని వైద్యం, తదితర అవసరాల ఉన్నవారికి ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం ఐదు వేల రూపాయల విలువైన డైపర్లను భవిత స్కూల్ పిల్లలు ఏడుగురికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత మండల కన్వీనర్ ఆకుల నరసింహమూర్తి, ఉపాధ్యక్షులు పూనెం పోసిబాబు, సెక్రటరీ కోటంరాజు రాంబాబు, కోశాధికారి నారాయణ పాల్గొన్నారు.

విభజించి.. ఏమారుస్తూ..!

(మొదటి పేజీ నుంచి)

ప్రయత్నాలు లేవంటే అతిశయోక్తి కాదు. ఎన్నికల్లో గెలిచేందుకు ఎస్‌సి, బిసి తరగతికి చెందిన ప్రజల మధ్య ఘర్షణలు సృష్టిస్తున్నారు. ముఖ్యంగా ఆయా తరగతుల్లోని యువతను తప్పుదోవ పట్టిస్తున్న పరిస్థితి నెలకొంది. నాయకుల మాటలు విని తమలో తామే ఘర్షణలు పడుతున్న పరిస్థితి కొనసాగుతోంది. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఆయా సామాజిక తరగతిని పట్టించుకుంటున్న పరిస్థితి ఏమాత్రం కనిపించడం లేదు. యువత మాత్రం ఘర్షణలకు దిగి కేసుల్లో ఇరుకుంటోంది. ఒకే సామాజిక తరగతికి చెందిన వారు నాయకుల మాటలు విని ఒకరిపై ఒకరు విమర్శలు, ఆరోపణలు చేసుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారుతోంది. నాయకులు విభజించి పబ్బం గుడుపుకుంటున్నారనే విషయం పేద ప్రజలు గ్రహించకపోతే తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడనుంది. దీనిపై ఆయా సామాజిక తరగతుల్లో చదువుకున్న వారు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎండుగడ్డికి గడ్డుకాలం

(మొదటి పేజీ నుంచి)

ఆదా చేసుకునేందుకు అధికశాతం మంది రైతన్నలు వరి పంటను యంత్రాల ద్వారా కోస్తుండటంతో గడ్డికి కొరతకు దారి తీసింది. కూలీల కొరతతో యంత్రాలపై ఆధారపడక తప్పడం లేదని అన్నదాతలు చెబుతున్నారు.

కూలీలతో ఎకరం కోయాలంటే రెండు రోజులు పడుతుందని, అదే యంత్రాలతో అయితే గంటల్లో కోత పూర్తవుతుందని, ఎకరానికి రూ.2500 నుంచి రూ.మూడు వేల వరకు ఖర్చవుతుందని చెబుతున్నారు. అయితే సమయం, ఖర్చు ఆదా గురించి ఆలోచించిన రైతులు ఎండుగడ్డి కొరత ఏర్పడుతుందని తెలిసినప్పటికీ తప్పని పరిస్థితుల్లో యంత్రాల ద్వారా వరి కోతలు కోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎండు గడ్డి ధర మండిపోతుంది. అయితే ఎండుగడ్డికి గడ్డుకాలం రావడంతో పశువుల పెంపకం కష్టంగా ఉందని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మాసూళ్ల ప్రక్రియ ముమ్మరంగా సాగడంతో ధాన్యంతోపాటు పాడి అవసరాలకు ఎండుగడ్డిని సైతం ఒబ్బిడి చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

ఆకాశాన్నంటిన ఎండుగడ్డి ధర

గతంలో వరి మాసూళ్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత రైతులు వారి అవసరాలకు మినహాయించుకుని మిగిలిన గడ్డిని సాటి రైతులకు ఉచితంగా ఇచ్చేవారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించట్లేదు. ఎండుగడ్డి ధర ఆకాశాన్నంటడంతో మరింత డిమాండ్ పెరిగింది. డెల్టా ప్రాంతంలో ఎండు గడ్డి ధర ఒకలా, మెట్ట ప్రాంతంలో మరోలా పలుకుతుంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఎకరం ఎండు గడ్డిని రైతుల నుంచి దళారులు రూ.1000 నుంచి రూ.1500 వరకు కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్ కిరాయికి రూ.1500, గడ్డి లోడు చేసేందుకు కూలీలకు రూ.1500 వెచ్చిస్తున్నారు. మొత్తంగా ఎకరానికి రూ.4 వేల నుంచి రూ.5 వేలలోపు ఖర్చవుతుంది. అయితే ట్రాక్టర్ గడ్డిని రూ.8 వేల నుంచి రూ.పది వేల వరకు విక్రయిస్తున్నారు. ఇదే మెట్ట ప్రాంతంలో అయితే ట్రాక్టరు గడ్డి రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు పలుకుతోందని రైతులు చెబుతున్నారు. మెట్టప్రాంత పాడి రైతులు ఎండుగడ్డి కోసం పరుగులు తీస్తున్నారు. నానాటికీ గడ్డి కష్టాలు అధికమవుతున్నాయని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఉంగుటూరు, గణపవరం, నిడమర్రు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల నుంచి మెట్ట రైతులు వరిగడ్డిని దిగుమతి చేసుకుంటున్నారు. అయితే దీన్ని అదునుగా చేసుకున్న కొంతమంది దళారులు ఎండుగడ్డిని అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయితే ఇప్పటికే పాడి పరిశ్రమ అంతంతమాత్రంగానే ఉంది. దాణా ధరలు అధికంగా ఉండడంతో మూగజీవాలను పెంచేందుకు పాడి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాల ధర అధికంగా ఉన్నప్పటికీ దాణా ధర రెట్టింపు కావడంతో గిట్టుబాటు కాని పరిస్థితి ఉంది. దీంతో పాడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

29న జిల్లాలో పవన్‌కళ్యాణ్ పర్యటన

(మొదటి పేజీ నుంచి)

ఐలాండ్ వద్ద సభలో పాల్గొని ప్రసంగిస్తారని జనసేన ఉంగుటూరు నియోజకవర్గ అభ్యర్థి పచ్చుమట్ల ధర్మరాజు తెలిపారు.

గణపవరం సభ అనంతరం పవన్ కళ్యాణ్ రోడ్డు మార్గంలో తాడేపల్లిగూడెం చేరుకుంటారని జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీను తెలిపారు. సోమవారం రాత్రి ఏడున్నర గంటలకు తాడేపల్లిగూడెం పట్టణంలోని గొల్లగూడెం సెంటర్లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తారని వివరించారు.

నరసాపురంలో ముదునూరి సతీమణి ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

వైసిపి నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజును మరోసారి గెలిపించాలని ఆయన సతీమణి శారద కోరారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులో ప్రజ ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తారని చెప్పారు. మండలంలోని తూర్పుతాళ్ల గ్రామంలో ముదునూరి ప్రసాదరాజు తనయుడు శ్రీకృష్ణంరాజు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బొక్కా రాధాకృష్ణ, దొంగ మురళీకృష్ణ పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని పెనుమంచిలి, ఆచంట గ్రామాలకు చెందిన ఎస్‌సి, బిసి, ఒసి సామాజిక తరగతుల నుంచి శనివారం వైసిపిలో చేరారు. పార్టీలో చేరినవారికి తూర్పుపాలెంలో వైసిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి శ్రీరంగనాధరాజు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రావి సుబ్బారావు, రావి రత్నంరాజు, గంగాధర్, మధు, రాకేష్, కేతా రాము, మల్లువలస పెద్ద శ్రీనివాసులు, వెంకటరమణ, లవకుమార్, సీతారాం, ధర్మరాజు, తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

ప్రజలందరికీ మేలు చేకూరేలా మేనిఫెస్టో : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

అన్ని తరగతుల ప్రజలకు లబ్ధి చేకూరేలా సిఎం జగన్ మేనిఫెస్టోను రూపొందించారని వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలో శనివారం నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోను 99 శాతం అమలు చేశామన్నారు. ఇప్పుడు వైసిపి విడుదల చేసిన మేనిఫెస్టోలో ప్రతి పథకాన్ని కొనసాగిస్తూ అదనంగా లబ్ధిని చేకూర్చే విధంగా మేనిఫెస్టోను రూపొందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకివీడులో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - ఆకివీడు

సంక్షేమ పథకాలను కొనసాగించేది తమ ప్రభుత్వం ఒక్కటేనని, ప్రతిఒక్కరూ ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాలని వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన స్థానిక పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పార్టీ, కార్యకర్తలు అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

'వైసిపితోనే పారదర్శక పాలన'

ప్రజాశక్తి - తణుకు రూరల్

ప్రజలందరికీ సంక్షేమం పారదర్శకంగా అందాలంటే జగన్ మరోసారి ముఖ్యమంత్రి అవ్వాలని మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 2, 5, 26 వార్డుల్లో కారుమూరి వెంకటనాగేశ్వరరావు, ఆయన అల్లుడు దిలీప్‌కుమార్ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ పారదర్శకంగా సంక్షేమం అందిస్తున్నారన్నారు. చంద్రబాబును నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. వైసిపితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ చిట్టూరి వెంకటసుబ్బారావు, మంగెన సూర్య, వంటెద్దు ఈశ్వరప్రసాద్, నూకల కనకదుర్గ, సుద్దుల పాండు, కారుమంచి మిత్ర, మారిశెట్టి శేషగిరి, పొట్ల సురేష్, కుడుపూడి చంద్రరావు పాల్గొన్నారు.

వైసిపి పాలనతో ప్రజల్లో విసుగు

టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి రఘురామకృష్ణంరాజు

ఎన్నికల ప్రచారంలో రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలతో రాష్ట్ర ప్రజలంతా విసుగెత్తిపోయారని టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. మండలంలోని పెదఅమిరం, జక్కరం, సీసలి, కాళ్ల, దొడ్డనపూడి, కాళ్లకూరు, జువ్వలపాలెం గ్రామాల్లో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. ఈ ప్రచారంలో ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, దొడ్డనపూడి సర్పంచి కొల్లి సుబ్బారావు, కొలనపల్లి సర్పంచి కొనకంచి సూరిబాబు, ఏరుబండి రామాంజనేయులు, జివి.నాగేశ్వరరావు, కట్రేడ్డి శ్రీనివాసరావు, నూకల భోగేంద్రబాబు, గోకరాజు నాగరాజు, పలు గ్రామాల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడితే కేసులా..!

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పోడూరు

వైసిపి ప్రభుత్వంలో పేదల పక్షాన, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తే తనపై 25 కేసుల నమోదు ఆ పార్టీ కక్ష సాధింపునకు నిదర్శనమని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. మండలంలోని జిన్నూరులో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శెట్టిబలిజ, దళితులు, పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. వీరందరికీ ఎంఎల్ఎ రామానాయుడు పార్టీ కండువాలు కప్పి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామానాయుడు మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి అరాచక పాలనలో అన్ని తరగతుల ప్రజలు మోసపోయారన్నారు. రానున్న టిడిపి కూటమి ప్రభుత్వంలో అందరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి రత్నరాజు, పాలవలస తులసిరావు, జడ్డు సూరి, దేవళ్ల ప్రసాద్, కోటి, ఎలకల శ్రీను, చొప్పల శ్రీను, పాటి శ్రీను, గండేటి చంద్రశేఖర్, కుక్కల దుర్గాప్రసాద్, గూడూరి తారక్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి చూసి ఓటేయండి

విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సిఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలు దృష్టిలో పెట్టుకుని మరోసారి వైసిపి ప్రభుత్వాన్ని స్థాపించే దిశగా సిద్ధం కావాలని విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రెండో పట్టణంలోని 32, 33, 34, 35 వార్డుల్లో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవరత్న పథకాలను అర్హులందరికీ అందించామన్నారు. విద్య, వైద్య, ఆరోగ్యం, వ్యవసాయానికి సిఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. అభివృద్ధికి ఆమడ దూరంగా ఉండే అంజిబాబును ప్రజలు నమ్మొద్దన్నారు. తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నానని చెప్పారు. భీమవరం పట్టణాన్ని, వీరవాసరం, భీమవరం మండల పరిధిలోని గ్రామాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేశానన్నారు. ఈ ప్రచారంలో వైసిపి ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, గ్రంధి బాలాజీ, పార్టీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, రెండో పట్టణ జెసిఎస్ కన్వీనర్ ఎఎస్.రాజు, ముత్యాల బుజ్జి, కొప్పర్తి జనార్దన్, బొర్రా వాసు, పిప్పల నాని, కైలా పాండురంగారావు, రేవూరి గోగురాజు, అభిరుచి రఘు, కాంట్రాక్టర్ సుబ్బరాజు, కొల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

'ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను గాలికొదిలేసిన వైసిపి'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులకు వైసిపి ప్రభుత్వం అర్థం లేకుండా చేసిందని టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి విమర్శించారు. తాడేపల్లిగూడెం ఎంవిఆర్ గ్రాండ్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎన్‌డిఎ ఛార్జిషీట్ ఆవిష్కరించారు. అనంతరం బాబ్జి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నిత్యావసర ధరలను విపరీతంగా పెంచిందన్నారు. ఇతర రాష్ట్రాల్లో లేనివిధంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచిన ఘనత ఎపిలోనే ఉందన్నారు. రాష్ట్రం నుంచి 22 ఎంపీ స్థానాలు ఇస్తే స్పెషల్ స్టేటస్‌ను తుంగలో తొక్కిందని విమర్శించారు. జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒకసారి అవకాశమిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకొస్తామని జగన్ చెప్పి నమ్మబలికారన్నారు. మళ్లీ అవి చేస్తాం ఇవి చేస్తామని ప్రజల ముందుకు వస్తున్నారని, దాని నుంచి ప్రజలను మేలుకొల్పే విధంగా ఎన్‌డిఎ చార్జ్ షీట్ ఆవిష్కరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేత ఈతకోట తాతాజీ, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, కూటమి నాయకులు వర్తనపల్లి కాశి, పరిమి రవికుమార్, కిలపర్తి వెంకట్రావు, పాతూరి రాంప్రసాద్‌చౌదరి పాల్గొన్నారు.

వైసిపి మేనిఫెస్టో రాష్ట్రానికి దిక్సూచి : కొట్టు

ప్రజాశక్తి- తాడేపల్లిగూడెం

వైసిపి ఎన్నికల మేనిఫెస్టో రాష్ట్రానికి దిక్సూచి వంటిదని ఆ పార్టీ తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అన్నారు. వైసిపి ఎన్నికల మేనిఫెస్టోపై తాడేపల్లిగూడెంలోని నివాసంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్లలో జగన్ ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా అమలు చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైసిపిని గెలిపించాలన్నారు.

టిడిపితోనే ప్రజా సంక్షేమం

మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజా సంక్షేమం టిడిపితోనే సాధ్యమని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు అన్నారు. మండలంలోని మోడి గ్రామంలో జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ సతీమణి, బండారు మాధవనాయుడు శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి టిడిపి, జనసేన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో బొమ్మిడి నాయకర్‌ను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో నాయకులు, సర్పంచి మారెళ్ల మాధవి, పొత్తూరి రామరాజు, మేకల సతీష్, పులపర్తి వెంకటేశ్వరరావు, నిప్పులేటి తారక రామారావు, దాసరి నాగరాజు, కృష్ణాజి, బొక్క సత్యనారాయణ, లక్ష్మణరావు, చక్రవర్తి, కొల్లాటి హరికృష్ణ, దాసరి శ్రీనివాస్, కటికల రామచంద్రరావు ఉన్నారు.

మద్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచాలి

నరసాపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అంబారీష్

ప్రజాశక్తి - నరసాపురం

గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయం, రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని విఆర్‌ఒలను, గ్రామ సెక్రటరీలను నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ ఎ.అంబారీష్ ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండలంలో గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ సెక్రటరీలతో సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అక్రమ మద్యం సరఫరాపై పూర్తి దృష్టి ఉంచాలన్నారు. మద్యం నిల్వలు, సరఫరా జరుగుతున్నట్టు తెలిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు ఆయా గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

బిజెపిని గద్దె దించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలన్

ప్రజాశక్తి -పాలకోడేరు

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న బిజెపిని రానున్న ఎన్నికల్లో గద్దె దింపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. శృంగవృక్షం ఎఫ్‌సిఐ రహదారిలో ఎన్నికల్లో భాగంగా సిపిఎం ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం సీనియర్ నాయకులు పాల వెంకటస్వామి అధ్యక్షత వహించగా గోపాలన్ మాట్లాడారు. పదేళ్ల బిజెపి పాలనలో అన్ని తరగతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించాల్సిన అవసరం కార్మిక వర్గంపై ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం కూడా బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తుందన్నారు. వైసిపికి కూడా గుణపాఠం చెప్పాలన్నారు. ఇండియా వేదిక అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, మండల కార్యదర్శి ఆశ్రియ, కదిలింది గోపాలరాజు, కార్మికులు పాల్గొన్నారు.

'ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి'

ప్రజాశక్తి - తణుకు

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్, సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు కోరారు. స్థానిక అమరవీరుల భవనంలో కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ పార్టీల సమావేశం డి.రామకృష్ణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడలి రామారావు మాట్లాడుతూ దేశం, రాష్ట్రం భవిష్యత్తు బాగుండాలంటే ఇండియా వేదిక గెలవాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టినట్లు చెప్పారు. ప్రతాప్, నాగరాజు మాట్లాడారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు కామన మునిస్వామి, జి.వెంకటేశ్వరరావు, బల్లా చినవీరభద్రరావు, రంగారావు గుబ్బల గోపీమూర్తి పాల్గొన్నారు.

ప్రచారం కోసం అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - ఆచంట

రాజకీయ పార్టీలు పోటీలో నిలిచే అభ్యర్థుల ప్రకటన జారీ, ప్రచార వీడియోలు జారీ చేసే సమయంలో తప్పనిసరిగా జిల్లా మీడియాకు సమన్వయ పర్యవేక్షణ కమిటీ ద్వారా ఆమోదం పొందాలని ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు అన్నారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ నిర్దేశించిన నియమావళిని మార్గదర్శకాలను అనుసరించి కచ్చితంగా ముందస్తు అనుమతి మేరకు వాటిని ప్రచారం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, సామాజిక మాధ్యమాల్లో, సినిమా థియేటర్లలో, లోకల్ ఛానల్స్, శాటిలైట్ ఛానల్ విభాగాల్లో ప్రచారం కోసం అనుమతులు తప్పనిసరని తెలిపారు. ముందస్తు అనుమతులు పొందనివారిపై ఉల్లంఘన నోటీసులు జారీ చేస్తామని స్వామినాయుడు తెలిపారు.

మాట్లాడుతున్న బలరాం

బిజెపి, పొత్తు పార్టీలను ఓడించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - గణపవరం

మే 13న జరగనున్న ఎన్నికల్లో బిజెపిని, దాంతో పొత్తు పెట్టుకున్న, తొత్తు పార్టీలను ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. శనివారం పిప్పర ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి చిన్న నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు బలరాం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే ఇవే ఆఖరి ఎన్నికలు అవుతాయని హెచ్చరించారు. ఉంగుటూరు అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి పాతపాటి హరికుమార్‌రాజు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య విజయానికి కృషి చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. సమావేశంలో మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి, నాయకులు పి.గోవింద్, ఎన్.రామకృష్ణ, ఎం.పెంటారావు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత్..

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి: ఎపి వ్యకాస

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ క్షేత్రస్థాయిలో లేకుండానే పనులు చేయిస్తున్నారని, దీనివల్ల కూలీలు నష్టపోతున్నారని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు ఆరోపించారు. మండలంలోని అప్పారావుపేటలో వ్యవసాయ కార్మిక సంఘం నేతలు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఉపాధి కూలీల పట్ల ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని ఆరోపించారు. ఇంట్లో బంధువులకు కూడా అక్రమంగా కొన్ని మస్తర్లు వేస్తూ అవినీతి పాల్పడ్డారని ఆరోపించారు. తక్షణమే దీనిపై విచారించి చర్యలు చేపట్టాలని, ఫీల్డ్ అసిస్టెంట్‌గా వేరొకరిని నియమించాలని సోమరాజు డిమాడ్ చేశారు. కూలీలకు రూ.600 కూలి ఇవ్వాలని, కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీకి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూలీలు పాల్గొన్నారు.

సెంట్రల్ లైబ్రరీ, కంప్యూటర్ లేబరేటరీ ప్రారంభం

నూజివీడు రూరల్: నూజివీడు ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో సెంట్రల్ లైబ్రరీ, కంప్యూటర్ నేషనల్ లేబరేటరీని ఆర్‌జియుకెటి ఛాన్సలర్ ఆచార్య కేసిరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విజేతలుగా నిలిచేందుకు విద్యార్థులకు లేబరేటరీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విజువలైజేషన్ సహకార ప్రాజెక్టులు, నెట్‌వర్కింగ్ అన్వేషణ పొందవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడెంలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం అభ్యర్థి మార్నీడి శేఖర్ (బాబ్జీ) ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శనివారం స్థానిక భాగ్యలక్ష్మి పేట, సీతారాంపేట, కొబ్బరితోట, యాగర్లపల్లిలో ఇంటింటా ప్రచారం సాగించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాజకీయ పక్షాలు సహకరించాలి: ఎస్‌పి

ప్రజాశక్తి - ఆచంట

పరిశీలిస్తున్న ఎస్‌పి అజిత

సార్వత్రిక ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో సాగేందుకు రాజకీయ పక్షాలు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్‌పి డాక్టర్ అజిత వేజెండ్ల అన్నారు. మండలంలో రోడ్డు రవాణా అందుబాటులో లేని అయోధ్యలంకలోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రోడ్డు మార్గం ద్వారా కరుగోరుమిల్లి గ్రామం చేరుకున్న ఎస్‌పి అక్కడి నుండి పడవపై గోదావరి దాటి అయోధ్యలంక గ్రామానికి చేరుకున్నారు. అయోధ్యలంక పరిధిలోని మర్రిమూల ఎంపిపి స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ద్విచక్ర వాహనంపై బయలుదేరి అయోధ్యలంక అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి అజిత మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడానికి తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యల గురించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామ ప్రజలతో మాట్లాడి శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి పోలీసు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సిఐ ఎన్.రజనీకుమార్, ఆచంట ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

30న హేలాపురి మినీ బాలోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

ఫ్లెక్సీని ఆవిష్కరించిన నిర్వాహకులు

ఏలూరు పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పది హేలాపురి ఆలోచన ట్యూషన్ సెంటర్ల విద్యార్థులకు 12 రకాల అకడమిక్, కల్చరల్, క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి 30వ తేదీన వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కమిటీ ప్రకటించింది. అందుకు సంబంధించిన ఫ్లెక్సీని, ప్రచార కరపత్రాన్ని పవర్‌పేటలోని అనే భవనంలోని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రంలో హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి విజిఎంవిఆర్.కృష్ణారావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ సాయంత్రం ఆరు నుండి ఎనిమిది గంటల వరకు ఏలూరు పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సెంటర్లలో విద్యార్థులకు 30వ తేదీన మినీ బాలోత్సవం సందర్భంగా వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పెద్దలు, దాతలు అంతా విద్యార్థులను ఆశీర్వదించడానికి రావాలని అన్నారు. ఏ వి ఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ 30వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుండి 6 గంటల వరకు విద్యార్థులతో పాటలు, పద్యాలు, కవితాగానం, విచిత్ర వేషధారణలు, నృత్యాలు వంటి అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఏప్రిల్ 30వ తేదీ మహాకవి శ్రీశ్రీ 114వ జయంతి కూడా ఉందన్నారు ఆ పేరుతో స్వర్ణ నృత్యాలయం విద్యార్థినులతో నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. బాలోత్సవం ట్యూషన్ సెంటర్స్‌కు సహకరిస్తున్న దీపక్ ఆక్సిజన్ ఎమ్‌డి ఎవి.సుబ్రహ్మణ్యం, రావి పద్మకుమారి, మారుబోయిన కోటేశ్వరరావు, ఆలపాటి నాగేశ్వరరావు, జె.సత్యనారాయణరాజు, ఎం.బ్రహ్మానందంకు కృతజ్ఞతలు తెలిపారు. 30వ తేదీన విద్యార్థులు, టీచర్లు, దాతలకు అభినందన కార్యక్రమం జరుగుతుందన్నారు. 30వ తేదీ మినీ బాలోత్సవంలో అడుసుమిల్లి నిర్మల, వేద సంఘాల పెద్దలు కమిటీ సభ్యులు పాల్గొంటారని అన్నారు. కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఫ్లెక్సీ, బ్రోచర్ ఆవిష్కరణలో గుడిపాటి నరసింహారావు, ఎం.లక్ష్మి, పి.సూర్యప్రకాష్, ఎం.మిల్టన్, బి.అంకితజైన్, ఎస్.వెన్నెలదేవి, ఎం.లహరి, ఎం.సిద్ధార్థ సాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులు లావణ్య, నోబుల్ విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - కలిదిండి, ముదినేపల్లి, మండవల్లి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినదిస్తున్న అభ్యర్థులు, నేతలు

ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య, కైకలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బొడ్డు నోబుల్ శనివారం కైకలూరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెదఎడ్లగాడి గ్రామంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం దయ్యంపాడు, కలకుర్రు, మణుగూరు, గోపవరం, రాచపట్నం, వరహాపట్నం, వెంకటాపురం, గుర్వాయిపాలెం, కలిదిండి, కొరుకోల్లు, సింగరాయపాలెం, వడాలి, ముదినేపల్లి, గుడ్లవల్లేరు జంక్షన్ రోడ్డు మండవల్లి మీదుగా ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో నియంత పాలన పోవాలన్నా, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నా ప్రజలు ఇండియా వేదికను బలపర్చి మోడీని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం నాయకులు మహంకాళి, అనిల్, వై.శేఖర్, వి.రమేష్, కాంగ్రెస్ ఎస్‌సి సెల్ రాష్ట్ర కన్వీనర్, ప్రచార కమిటీ సభ్యులు డి.సాల్మన్, వి.పద్మా రావు, రాజ్ కుమార్ శ్రీను, యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి సతీష్ రాయల్, పలువురు నేతలు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న పరిశీలకులు

ఆర్‌ఒ కార్యాలయాన్ని సందర్శించిన వ్యయ పరిశీలకులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు షేరింగ్ జోర్డన్ బూటియా శనివారం ఉంగుటూరు రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అధికారి, అక్కౌంటింగ్ టీమ్‌తో సమావేశమయ్యారు. ఆర్‌పి చట్టం 1954 సెక్షన్-77 ప్రకారం పార్లమెంట్‌కు పోటీ చేస్తున్న అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీకి పోటీ చేయుచున్న అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఖర్చుచేయకూడదన్నారు. అభ్యర్థి నామినేషన్ వేసిన తేదీ నుండి ఫలితాల ప్రకటించే వరకూ ఎన్నికల ఖర్చుకు సంబంధించి ప్రత్యేక ఖాతాను నిర్వహించాల్సి ఉంటుందని, వాటని అక్కౌంటింగ్ టీమ్ పరిశీలించి సరైన సమయంలో నివేదికలు అందజేయాలన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు అక్కౌంటింగ్ టీమ్ అనుసరించాల్సిన అంశాలను ఆయన వివరిస్తూ పలు సూచనలు చేశారు.



ఓటరు స్లిప్పుల పంపిణీ

బిఎల్‌ఒలచే ఓటర్ స్లిప్‌ల పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బూత్ లెవెల్ అధికారులు సచివాలయ సిబ్బంది సహకారంతో ఓటర్ల స్లిప్పులను పంపిణీ చేస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ఓటర్ జాబితాల ఆధారంగా సీరియల్ నంబరు, పోలింగ్ బూత్ నెంబరుతో స్లిప్‌లు వచ్చాయి. వాటిని బిఎల్‌ఒలకు అధికారులు శుక్రవారం రాత్రి అందజేశారు. రెండు, మూడు రోజుల్లో స్లిప్‌ల పంపిణీ పూర్తి చేసేయాలని అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో గ్రామాల్లో బూత్ లెవెల్ అధికారులు ఇంటింటా పర్యటించి స్లిప్స్ ఇస్తున్నారు. గొల్లగూడెం నారాయణపురంలో బిఎల్‌ఒలు చంద్రబాబు, దుర్గాధర్, మల్లేశ్వరరావు స్లిప్‌లు పంపిణీ చేశారు.

నిట్ విద్యార్థులచే ఎలక్ట్రిక్ బైక్ రూపకల్పన

అభినందించిన రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



ఎలక్ట్రిక్ బైకును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

భవిష్యత్తు అంతా విద్యుత్ వాహనాలదేనని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎపి నిట్) ఆచార్యులు డాక్టర్ టి.కార్తికేయశర్మ మార్గనిర్దేశంలో పలువురు విద్యార్థులు (ఫ్లెక్సీ పోల్డ్) ఎలక్ట్రికల్ బైకును రూపకల్పన చేశారు. మెకానికల్ ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఎం.మనోజ్‌నాయక్, ఎం.అనీషా, కె.ప్రత్యూష, కె.రాజేశ్వరి, కె.గణవరప్రసాద్ బృందంగా ఏర్పడి ఈ ఎలక్ట్రికల్ బైక్‌ను 20 రోజులు శ్రమించి రూపొందించారు. దీనికి రెండు గంటలు ఛార్జింగ్ పెడితే గంటకు 18-20 కిలోమీటర్ల వేగంతో 25 కిలోమీటర్ల వరకు సులభంగా ప్రయాణించొచ్చు. ఇది 150 నుంచి 200 కిలోల బరువును తట్టుకోగలదు. అంతేగాకుండా ఈ బైక్‌ను మడతపెట్టి కారులో ఎక్కడికైనా సులువుగా తీసుకెళ్లవచ్చు. కార్లు వంటి వాహనాలు వెళ్లలేని ప్రదేశాల్లో, మోకాళ్ల నొప్పులతో ఎక్కువ దూరం నడవలేని వృద్ధులకు ఈ విద్యుత్ బైక్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ వాహన రూపకల్పన నిమిత్తం మొత్తం రూ.20 వేలు నగదు వెచ్చించారు. విద్యార్థులను, వారికి అవసరమైన సలహాలు,సూచనలిస్తూ మార్గదర్శిగా వ్యవహరించిన ఆచార్యులు డాక్టర్ టి.కార్తికేయశర్మను రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి, డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.బాబూరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ విద్యా సంస్థకు చెందిన పలువురు విద్యార్థులు ఎలక్ట్రికల్ బైకును రూపొందించడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ జి.సంతోష్‌కుమార్, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎం.హైమావతి తదితరులు పాల్గొన్నారు.